## చిట్టికథ

# చెప్పులో రాయి



రోడ్డు వెంట చరా చరా తలవంచుకుని నడుస్తోంది దీప. తన వెనుక ఎవరో అనుసరిస్తున్నట్లు అన్పించుతూంది. ఎవరా అని వెనక్కి తిరిగి చూసింది. ఒక్కసారి గుండె గుభిల్లుమంది దీపకి, ఆ మనిషి తన వంకే చూస్తూ కన్పించేసరికి.

దీప ఇంటర్ ఫైనల్ చదువుతున్నది. ఆ రోజుతో పరీక్షలు ఆఖరు అని పరీక్ష అయ్యాక సినిమా ప్రోగ్రాం వేసుకున్నారు తన ఫ్రెండ్స్ అందరూ. మళ్ళీ ఏరోజు ఎక్కడ ఎవరింట్లో కలుసుకోవాలి అన్నది నిర్ణయించుకొని సినిమా అయినాక హాలువద్దే ఎవరి దారిన వారు విడిపోయారు. దీప ఇంటికి వెళ్ళవలసిన బస్సు ఎక్కాలంటే అక్కడ నుంచి ఒక పది నిమిషాల నడక వుంది. తనకి నడక అలవాటు వుండటం మూలాన ఆ కాస్త దూరానికి రిక్షా ఎందుకులెమ్మని నెమ్మదిగా నడక మొదలు పెట్టింది దీప.

సినిమా హాలులో తాము చెప్పుకున్న కబుర్లు, చేసిన అల్లరి అందర్నీ ఎలా కామెంట్ చేసి నవ్వుకుందీ గుర్తుకొస్తూ నెమ్మదిగానే నవ్వుకుంటూ నడవసాగింది. ఇంతలో ఈ మనిషిని చూసి "ఈ వెధవ ఎవరో తనని చూసి నవ్వుతున్నానని అనుకుంటున్నాడు కామోసు" అనుకుంది నడక వేగం పెంచుతూ. తను స్వతహాగా ధైర్యవంతురాలే అయినా ఇలాంటి సన్నివేశం ఎన్నడూ ఎదుర్కోని కారణంగా కాస్త జంకింది. ఒకవేళ భయం వేసినా ఒక పట్టాన బయటకు వ్యక్తం చేసే స్వభావం కాదు దీపది. మేకపోతు గాంభీర్యం ప్రదర్శించ గలదు.

ఎలాంటి వాడోనని ముఖంలో ఏభావం కన్పించనీయకుండా చుట్టూ చూస్తున్నట్టు చూసేసరికి దాదాపుగా ప్రక్కనే నడుస్తున్నాడు వాడు. మనిషి చూడటానికి అందంగా అమాయకంగా వున్నాడు. చేతిలో ఏవో పుస్తకాలు వున్నాయి. మొహం చూస్తే అలా వెంటబడే రోమియో ముఖంలా లేదు కాని "వెధవబుద్ధి ఎలాంటిదో ఎవరికి తెలుసు!" అనుకుంది నడక వేగం పెంచుతూ. కానీ అతడు కూడా నడక వేగం పెంచటంతో భయం వేసి బుర్ర పలురకాలుగా పోసాగింది. కాలేజీలో అక్కడ అక్కడ విన్న సంఘటనలు గుర్తుకొచ్చి భయం ఎక్కువ కాసాగింది. "పోనీ! ఈ వెధవనే ముందుకు పోనీ! నెమ్మదిగా వెళ్ళచ్చు పీడి పీడ పోయాక" అనుకుని మెల్లగా నడవసాగింది. కాని వాడు దీపని గమనించి తన నడక వేగం తగ్గించే వాడు. సమానంగాను కాస్త వెనగ్గాను నడవటం మొదలు పెట్టాడు. దాంతో హడలి పోయింది దీప. వాడిని ఏమైనా అందామా అంటే తను ఒక్కర్తే వుంది. గుంపుగా వుంటే వుండే ధైర్యం లేదిప్పుడు. ఒకవేళ ఇప్పుడేమైనా అంటే ఊరుక్కుని తర్వాత పగతీర్చుకుంటాడేమోనని భయం. వెనక్కి గాని పక్కకిగాని తిరిగి వాడి వంక చూడకపోయినా వాడు తననే గమనిస్తూ చూస్తున్నట్లు గమనించింది. అంత రద్దీగా వున్న రోడ్డుమీద కూడా వాడు అంత ధైర్యంగా ఫాలో చెయ్యటాన్ని చూసి "ఏవన్నా అన్నా వీడితో ఏం తంటా వచ్చి పడ్తుందో" అని భయంగా ఆలోచిస్తుంటే నడక కూడా సవ్యంగా సాగలేదు దీపకి. నడుస్తూనే చుట్టూ ఎవరైనా తెలిసిన వాళ్ళు కన్పిస్తారేమో వాళ్ళను కల్పుకుంటే వీడి పీడ విరగడ కావచ్చునేమో అనుకుంటే తన అదృష్టానికి ఎవరూ తెల్సినవాళ్ళు కూడా కన్పించేట్లు లేరు అనుకుంది చిరాకుగా. "వెధవ సినిమాకి ఎందుకు వచ్చాను వీళ్ళ మాటలు నమ్మి" అని ఫ్రెండ్సుని తిట్టుకుంది.

ఎంత లేదన్నా ఇంకా సగం దూరం వుంది నడక. వీడి లోపల ఏం చేస్తాడో నని భయం. వాణ్ణి ఎలా వదిలించుకొని హాయిగా నడుద్దామా అని ఆలోచిస్తూ నడుస్తోంది. నడక కూడా సరిగ్గా రావట్లేదు, సమయానికి అనుకుంది. ఇంతలో పుండుమీద కారంలా చెప్పులో రాయి ఒకటి చిన్నది దూరింది. దీప వేసుకున్నవి బెల్టువున్న ఎత్తు చెప్పులు. దాంతో "ఖర్మ! ఇవాళ ఏం అవుతుందో కాని, వీడు ఏమీ అనకుండా వీడి పీడ ఎలా వదిలించుకోవాలా అని నేను చస్తుంటే ఈ రాయి ఒకటి అడుగులు గబగబా వేయకుండా ప్రాణం తీయడానికి" అనుకుంది. అయినా వాడి వెకిలి చూపులకి భయపడనట్లుగా వాడు ఫాలో అవుతున్నట్లు తాను గమనించనట్లుగా వుండేందుకని మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ ఏమీ పట్టనట్లు మధ్యలో కాలు కాస్త నెమ్మదిగా విదిలించింది. రెండుమూడు సార్లు రాయి గాని కిందపడి పోతుందేమోనని ఆశతో. కాని అది క్రిందపడలేదు సరికదా ఇంకా కీలకమైన స్థానంలో చేరి కూర్చుంది.

"లాభం లేదు! ఈ రాయి తీస్తేగాని నడవలేను" అనుకుని కాస్త ముందు ఇద్దరు కూరగాయల అవ్వలు మాట్లాడుకోవటం చూసి అక్కడ ఆగిపోయింది దీప. "సరే ఏమైతే అదే అవుతుంది. చెప్పు విప్పి రాయినితీసి పారేసి మళ్ళా వేసుకుంటే నాల్గునిమిషాల్లో బస్టాండుకి చేరుకోవచ్చు. ఆతర్వాత బస్సు ఎక్కేస్తే వీడు ఇంకేం చెయ్యలేడు." అనుకొని వంగింది. వంగుతూ వాడేం చేస్తున్నాడోనని వాడి ముఖం చూసేసరికి వాడి ముఖంలో కించిత్ భయం కన్పించినట్లయింది. తను చెప్పు విప్పి రాయి తీసిపారేసింది. తిరిగి వేసుకుందామని తల ఎత్తే సరికి బాగా అంత దూరాన పరుగు పందెం పెడుతూ వాడు నడచి వెళ్ళిపోవటం చూసి బిత్తరపోయింది. కారణం ఏమై వుంటుందా అని చుట్టూ చూసింది. ఎక్కడా పోలీసు లాంటి కార్తీలు కూడా కన్పించలేదు. మళ్ళీ అంతలో టక్కున అందుకు కారణం తన చేతిలో వున్న చెప్పు అని తెల్సుకుని పొంగిపోయింది.

"అమ్మయ్య! చెప్పులో రాయి దూరిన మాట ఎలా వున్నా అది వాణ్ణి కొట్టటానికి తీస్తున్నాననుకొని పారిపోయినట్లున్నాడు వెధవ! పోనీలే పీడా పోయింది." అని సంతోషంగా చెప్పు వేసుకొని గబగబా నడవడం మొదలుపెట్టింది దీప. ఈ విషయం తన ఫ్రెండ్సుకి చెప్తే తన భయాన్ని ఆట పట్టించి నవ్వుతారేమోనని ఆలోచిస్తూ నడుస్తూనే చిన్నగా నవ్వుకుంది. అంతలోనే వులిక్కిపడి వెనకా ముందూ చూసింది. ఎవ్వరూ లేరు. అబ్బ! చెప్పులో రాయెంత సాయం చేసింది నాకు అనుకుంది.

—కె. సంధ్య